సాక్షి
వరంగల్
శనివారం । 14 । జనవరి । 2023



రేపు వందే భారత్ రైలు - 8లో
వరంగల్ ప్రాంత ప్రజలు ఎప్పడెప్పడా అని ఎదురుచూస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 15న సంక్రాంతి కానుకగా వరంగల్ మీదుగా పరుగులు తీయనుంది.



'కన్వేయర్ బెల్ట్'కు స్థల పరిశీలన - 8లో
మేడారం సమ్మక్క-సారలమ్మల గద్దె ప్రాంగణంలో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు.

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
$30^0/16^0$
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యరశ్మితో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గందరగోళంగా 'పల్లె వైద్యుల' కౌన్సెలింగ్

గీసుకొండ: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం కాంట్రాక్టు పద్ధతిపై నియమించే పల్లె దవాఖానా వైద్యుల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. జిల్లాలోని పల్లె దవాఖానాల్లో 38 మంది వైద్యుల నియామకానికి ఇటీవల కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయగా.. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించారు. వైద్యుల పోస్టులకు మొత్తం 481 మంది దరఖాస్తు చేసుకోగా.. కౌన్సెలింగ్‌కు చాలా మంది రాలేదని తెలుస్తోంది. అయితే మెరిట్ ఉన్న వారికి కాకుండా లేని వారికి పోస్టింగ్‌లు ఇస్తున్నారని, కౌన్సెలింగ్‌కు రానివారిని పరిగణనలోకి తీసుకోకుండా హాజరైన వారికి మెరిట్, రోస్టర్ ప్రకారం అవకాశం కల్పించాలని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు అధికారులను కోరారు. దీనిపై అభ్యర్థులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులకు వినతిపత్రం సమర్పించడానికి ప్రయత్నించగా.. వారు స్వీకరించలేదు. కౌన్సెలింగ్‌లో మొత్తం 12 మంది ఎంబీబీఎస్, మరో 12 మంది బీఏఎంఎస్ అభ్యర్థులను ఎంపిక చేయగా.. మిగిలిన పోస్టులను ఇదే కౌన్సెలింగ్‌లో భర్తీ చేయాలని కోరగా.. అధికారులు నిరాకరించారు. గొడవ జరగకుండా అధికారులు పోలీసులను రప్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

గోదాం నిర్మాణాల పరిశీలన



నల్లబెల్లి: నల్లబెల్లి, మేడపల్లి, గుండ్లపహాడ్, అర్శనపల్లి గ్రామాల్లో నల్లబెల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాం నిర్మాణ పనులను నాబార్డు, కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, డీసీసీబీ ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం సందర్శించారు. నాబార్డు రిటైర్డ్ జీఎం కె.ఐ.హరీశ్ గోదాం నిర్మాణ పనులను పరిశీలిస్తూ.. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల అవసరాల మేరకు నాబార్డు నిధులను సద్వినియోగం చేసుకుంటూ గోదాంల నిర్మాణానికి సహకార సంఘం ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట తెలంగాణ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఏజీఎం బ్రజేష్, డీసీసీబీ సీఈఓ చిన్నారావు, ఇంజనీరింగ్ అధికారి కొంగర మోహన్, అన్నపూర్ణ, నల్లబెల్లి పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి మోహన్‌రావు, సీఈఓ నాగెల్లి మొగిలి, డైరెక్టర్ చల్ల యాదగిరి పాల్గొన్నారు.

'వందే భారత్'కు ఘన స్వాగతం పలకాలి



కాజీపేట: ఈనెల 15న ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ప్రారంభం కానున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న దృష్ట్యా బీజేపీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ కోరారు. శుక్రవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు, జిల్లా పదాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, వంగాల సమ్మిరెడ్డి, కుసుమ సతీశ్, ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఐలోని జాతర షురూ..

● ధ్వజారోహణంతో దేవుళ్లకు ఆవాహన



ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణంతో దేవుళ్లకు ఆవాహన పలికారు. భక్తులు ఒక్కొక్కరుగా ఆలయానికి చేరుకుంటున్నారు. దీంతో సందడి నెలకొంది. కొందరు భక్తులు స్వామివారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. శివసత్తుల పూనకాలు, నృత్యాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

- ఐనవోలు

- వివరాలు 8లో

భోగ భాగ్యాలనిచ్చే భోగి





నేడు భోగి, రేపు సంక్రాంతి

● మార్కెట్లో పండుగ సందడి
● పిండి వంటల ఘుమఘుమలు

భగభగ మంటలు చలిని తరమగా.. గొబ్బెమ్మలు వాకిళ్లను అలంకరించాయి. హరివిల్లు నేలపై వాలగా.. రంగవల్లులు వాకిలికి కొత్తందాన్ని తెచ్చాయి. ఒంటికి రాసిన నువ్వుల నూనె వేడిని పెంచగా.. రేగుపళ్ల బుడబుడ స్నానాలాచరించాయి. పిండి వంటలు ఘుమఘుమలాడగా.. భోగి భోగ భాగ్యాలను ఇంట్లోకి చేర్చింది. వరంగల్ జిల్లా భోగి పండుగకు సిద్ధమైంది. శుక్రవారం నుంచే నగరంలో పండుగ వాతావరణం కనిపించింది.

- హన్మకొండ కల్చరల్

ధనుర్మాసం చివరిరోజు కావడంతో శనివారం పలు వైష్ణవాలయాల్లో శ్రీగోదారంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. దక్షిణాయనంలో సూర్యుడు రోజురోజుకూ భూమికి దక్షిణం వైపుగా కొద్దికొద్దిగా దూరమవుతాడు. ఈ క్రమంలో భూమిపై చలి పెరుగుతుంది. ఈ చలి నుంచి తట్టుకునేందుకు భగభగమండే మంటలు వేస్తుంటారు. ఈ మంటలకు భోగి అనే పేరొచ్చింది. సంక్రాంతి ముందురోజు భోగితో పండుగ వాతావరణం ప్రారంభమవుతుంది. చలికాలం కావడంతో శరీరానికి వేడినందించే నువ్వుల నూనె, ఆవనూనెతో శరీరాన్ని మర్దన చేసి భోగిరోజు స్నానం చేస్తారు. రేగుపండ్లు వేసి నీళ్లు మరగబెట్టి స్నానం చేయడం ప్రత్యేకం. ఇలా చేయడం వల్ల చలితో బిగుసుకుపోయిన కీళ్లు వదులవుతాయని చెబుతుంటారు. ఐదారేళ్ల వయసు వరకు పిల్లలకు బొడబొడికలు(భోగిపండ్లు) పోస్తారు. వాకిళ్లను అలికి గొబ్బెమ్మలు పెడతారు.

ప్రారంభమైన సంక్రాంతి సందడి

భోగిని పురస్కరించుకుని నగరంలోని పలు కూడళ్లలో రంగవళ్లులు, మామిడాకులు, చామంతి, బంతి, ఆవుపేడ, రేగుపండ్లు, నవధాన్యాలు, గరిక, పిండికూరాకు మొదలైనవి కొనేందుకు వచ్చిన వారితో శుక్రవారం రాత్రి సందడి నెలకొంది. యువతులు గాజులు తదితర అలంకరణ సామగ్రి, సంక్రాంతి నోము సామగ్రిని కొన్నారు. వరంగల్‌లోని పిన్నవారి వీధి, రామన్నపేట, బట్టలబజార్, కాశిబుగ్గ, గోపాలస్వామి గుడి, హనుమకొండ చౌరస్తా, కుమార్‌పల్లి, టైలర్‌స్ట్రీట్, అంబేడ్కర్ సెంటర్, అదాలత్ సెంటర్, సుబేదారిలోని అమరవీరుల స్తూపం, కాజీపేట చౌరస్తా తదితర ప్రాంతాల్లో అమ్మకాలు జోరుగా సాగాయి.

గాలిపటమా పద.. పద

ఎగరవే.. ఎగరవే గాలిపటమా.. అంటూ వీలైనంత పైకి ఆకాశంలోకి పతంగులను ఎగరవేయడం పిల్లలకే కాదు పెద్దలకూ సంతోషాన్నిస్తుంది. సంక్రాంతి వచ్చిందంటే చాలు గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తుంటారు. నగరంలోని మార్కెట్లలో విక్రయాలు ఊపందుకున్నాయి. టోపీ పతంగ్, గిల్‌వోరా, గుడ్డు పతంగ్, నామందార్, టోపీ నామందార్, గుడ్డుటోపీదార్, చేప లాగోట్, చేప రెండు గుడ్లు, గవ్వాగీట్, గిల్దావర్ తదితర పేర్లతో పతంగులను పిలుస్తూ ఉంటారు. కానీ.. ప్రస్తుతం డ్రాగెన్ కైట్, అవతార్, చోటా భీమ్, బాహుబలి తదితర పేర్లతో అందుబాటులోకి వచ్చాయి. పతంగులు ఎగరవేయడం హైదరాబాద్ తర్వాత వరంగల్‌లోనే ఎక్కువ. హైదరాబాద్, ఉత్తరప్రదేశ్ నుంచి గాలిపటాలను తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు.



'ఎర్రబెల్లి' కోలాటం

పర్వతగిరి: భోగి పండుగను పురస్కరించుకొని పర్వతగిరిలోని తన స్వగృహంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం రాత్రి కోలాట మాడారు. భోగి మంటలు వెలిగించి గ్రామస్తులతో కలిసి సంక్రాంతి పాటలకు కోలాటం వేశారు. అనంతరం మంత్రి గ్రామస్తులకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

దేశంలోనే ఆదర్శంగా తెలంగాణ

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు. పక్కన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

రాయపర్తి: సీఎం కేసీఆర్ చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం కిష్టాపురం క్రాస్‌రోడ్డు సమీపంలోని వీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశంలో మంత్రితోపాటు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్రం సిద్ధించాక.. సీఎం కేసీఆర్ అధికారం చేపట్టాక అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందన్నారు. ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించే బీఆర్ఎస్ తొలి బహిరంగ సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఎంపీపీ అనిమిరెడ్డి, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మండల పార్టీ ఇన్‌చార్జ్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింహానాయక్, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు సురేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, పూస మధు, లక్ష్మీనారాయణ, నయీమ్, బాబు, సతీశ్, సుభాష్, ఉస్మాన్, సుదర్శన్, యాదగిరిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నర్సయ్య, కాశీనాథం, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ రూరల్: సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం కొరకు మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 23 వరకు గడువు ఉందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.విక్రమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్/డాక్టరేట్ కోర్సులు చదవడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ.20లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, విద్యార్థులు విదేశాలకు వెళ్లడానికి ఒక ప్రయాణ టికెట్ ఖర్చు కూడా భరిస్తుందని పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నారావుపేట: లింగగిరి గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి జాతర శుక్రవారం ప్రారంభమైంది. స్వామివారు, భూదేవి, శ్రీదేవిల అమ్మవారల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి.. గుట్టపై ఆలయ ఆవరణలో కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసచార్యులు, గుడి ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రముఖ వ్యాపారి దొడ్డ విజయ్-కవిత దంపతులు కల్యాణ తంతును ఘనంగా చేపట్టారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అభిషేక మహోత్సవం, మహాదాశీర్వచంతోపాటు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై తోట మహేందర్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదారపు భాస్కర్, ఉప సర్పంచ్ బూర్గు రాజశేఖర్, ఎంపీటీసీ పరకాల లక్ష్మీ రాజన్న, ఓరుగంటి నర్సింహారావు, అనుముల అశోక్, దొడ్డ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



ముగ్గులను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నర్సంపేట: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందని వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో గోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించడంతోపాటు భోగి మంటలు వేశారు. పలు రంగాల్లో గుర్తింపు పొందిన వారిని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముగ్గుల పోటీల్లో పట్టణానికి చెందిన వల్ల పద్మ ప్రథమ బహుమతి సాధించగా.. రూ.5,016 అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, గోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు గోక రామస్వామి, జనరల్ సెక్రటరీ వినోద్‌కుమార్, గోక స్వప్న, కౌన్సిలర్లు జుర్రు రాజు, దార్ల రమాదేవి, పెండెం రాజేశ్వరి, బాణాల ఇందిర, చిలువేరు రజనిభారతి, నల్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి. పక్కన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

● కలెక్టర్ బి.గోపి

వరంగల్: కంటి వెలుగు కార్యక్రమంపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, లైన్ డిపార్ట్‌మెంట్లు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ బి.గోపి అన్నారు. శుక్రవారం కొత్తవాడలోని కెమిస్ట్రీ భవన్‌లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన కంటి వెలుగు కార్యక్రమంపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి 44 బృందాలను ఏర్పాటు చేశామని, ఐఈసీ మెటీరియల్, ఏఆర్ట్ మిషనరీలు, కంటి అద్దాలు తదితరాలను సమకూర్చామన్నారు. శిబిరంలో 18 ఏళ్లు పైబడిన వారికి కంటి పరీక్షలు చేస్తారని, కేంద్రాలకు వచ్చేవారు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ తీసుకుని రావాలన్నారు. జిల్లా కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి కంటి అద్దాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు, డీపీఓ అర్చన, డీఈఓ వాసంతి, అన్ని మండలాల స్పెషల్ ఆఫీసర్లు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చల్లా మధుసూదన్, డాక్టర్ పద్మశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

గీసుకొండ: పరకాల నియోజకవర్గ పరిధిలోని 15, 16, 17 డివిజన్ల(విలీన గ్రామాల)లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండలోని తన నివాసంలో మూడు డివిజన్ల పరిధిలో చేపట్టే పనులపై సంబంధిత అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభించిన పనులను త్వరగా పూర్తి చేయాలని, కొత్త పనులను ప్రారంభించాలన్నారు. ధర్మారం వద్ద వరంగల్-నర్సంపేట రహదారిలో ఏర్పాటు చేస్తున్న కాకతీయ స్వాగత కళాతోరణం పనులను త్వరగా పూర్తి చేయాలని, రెడ్డిపాలెంలో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఆకులపెల్లి మనోహర్, సుంకరి మనీషా శివకుమార్, గద్దె బాబు, ఏఈలు కృష్ణమూర్తి, సంతోశ్, అడిషనల్ సిటీ ప్లానర్ బషీర్, ఎంహెచ్‌ఓలు రాజేశ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

అనధికార సర్వీసులు తొలగించాలి



వ్యవసాయ సర్వీసులను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ మధుసూదన్‌రావు

రాయపర్తి: డీబీ కెనాల్‌పై ఉన్న అనధికార వ్యవసాయ విద్యుత్ సర్వీసులను తొలగించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ పి.మధుసూదన్‌రావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ల్యాబర్తి సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ తనిఖీ చేసి.. అధిక లోడ్ వస్తున్న సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు ఫీడర్‌లో పర్యటించారు. డీబీ కెనాల్‌పై అనధికార వ్యవసాయ సర్వీసులు నడుస్తుండటాన్ని గమనించిన ఆయన సిబ్బందిని మందలించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఈ పలువురు రైతులతో మాట్లాడి.. విద్యుత్ సరఫరా తీరును తెలుసుకున్నారు. మోటార్లకు కెపాసిటర్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల మెరుగైన ఓల్టేజీతోపాటు మోటార్లు కాలిపోవని, ఫీడర్‌పై లోడ్ తగ్గుతుందని ఎస్ఈ సూచించారు.

మాయదారి మాంజా..!

మహా నగరంలో చైనీస్ మాంజాపై నజర్

● ప్రాణాంతక దారంపై పోలీసులు, అటవీ శాఖ నిఘా
● సీపీ ఆదేశాలతో ఇప్పటికే రంగంలోకి ప్రత్యేక బృందాలు
● సంప్రదాయ దారాలే మేలంటున్న ఫారెస్ట్ అధికారులు



పతంగులు కొనుగోలు చేసిన ఆనందంలో పిల్లలు



సాక్షి, వరంగల్: పిల్లలు, యువత సంక్రాంతి పండుగ వేళ గాలిపటాలు ఎగురవేయాలనే జోష్‌లో ఉంటారు. పోటీపడి పతంగులు గాలిలో ఆడిస్తూ కేరింతలు కొడుతూ సందడి చేస్తుంటారు. అయితే పతంగుల కోసం వినియోగించే చైనీస్ మాంజా గురించి పూర్తిస్థాయిలో తెలియకపోవడంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదమూ ఉంది. తాజాగా శుక్రవారం హైదరాబాద్ నాగోల్ ఫ్లై ఓవర్‌పై బండిపై వెళ్తున్న ఓ కుటుంబానికి మాంజా గొంతుకు అడ్డుపడి తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఓ చిన్నపాప పరిస్థితి విషమంగా ఉంది. ఈనేపథ్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల్లోనూ పతంగులు ఎగురవేసే పిల్ల లు జాగ్రత్త పడాల్సిన అవసరం కనిపిస్తోంది. చైనీస్ మాంజాపై వరంగల్ కమిషనరేట్ పోలీసులు, అటవీ శాఖ అధికారులు కూడా నిఘా ఉంచారు. ఆ మాంజా విక్రయిస్తూ ఎవరు కంటపడ్డా ఉపేక్షించేది లేదని, పతంగుల వ్యాపారులపై ఓ కన్నేసి ఉంచాలని పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో ఇప్పటికే ప్రత్యేక బృందాలు నిఘా పెట్టాయి. వీటిని విక్రయించడం ద్వారా అధిక లాభాలు ఉంటాయన్న ఉద్దేశంతో కొందరు వ్యాపారులు చేసే బిజినెస్ వల్ల కొన్ని సందర్భాల్లో మనుషుల ప్రాణాలతోపాటు పక్షుల ప్రాణాలు పోయే అవకాశం ఉంది. దీంతో అటవీ శాఖ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. చైనీస్ మాంజాకు బదులుగా సంప్రదాయ కాటన్ దారాలను పతంగుల కోసం వినియోగించాలని కోరుతున్నారు.

సమాచారం ఉంటే ఇవ్వాలి..

'చైనా మాంజా అమ్మినా, నిలువ, రవాణా చేసినా ఐదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష వరకు జరిమానా ఉంటుంది. మాంజా వాడకం వల్ల మనుషులకు, పక్షులకు హాని జరిగితే 3నుంచి 7 ఏళ్ల దాకా జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా ఉంటుంది. చైనా మాంజా రవాణా చేస్తే ఆయా వాహనాలను కూడా సీజ్ చేస్తారు. చైనా దారం అమ్మకం గురించి వివరాలు తెలిస్తే అటవీ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1800 4255 364, డయల్ 100కు సమాచారమివ్వాలి. పోలీసుల సమన్వయంతో మంజా విక్రయాలపై నిఘా ఉంచాం' అని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్ తెలిపారు.

అందుకే ఇది డేంజర్..

మార్కెట్‌లో దేశీయ దారాలకంటే చైనా మాంజా పదునుగా, చాలా పటుత్వంగా ఉంటుంది. దీని తయారీకి ప్రమాదకరమైన రసాయనాలతోపాటు నైలాన్ దారం, గాజుపొడి వాడుతుంటారు. అది చేతితోపాటు ఎక్కడ తగిలినా గాయం అవుతుంది. దీనిని కట్ చేయడానికి బ్లేడ్ లేదా కత్తెర వాడాల్సిందే. ఈ కారణంగానే చాలా మంది చైనా మాంజా వైపు ఆకర్షితులవుతున్నారు. ఈ మాంజా కారణంగా పక్షులు ఆకాశంలో ఎగిరే సమయంలో రెక్కలు, కాలికి తగిలి గాయపడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడుతున్నాయి. అంతేకాదు.. మాంజాను చేతిలో పట్టుకుని ఎగిరేసే క్రమంలో వేళ్లు కోసుకుపోయి పిల్లలు, యువత గాయాల పాలవుతున్నారు. ఈ దారం మెడకు చుట్టుకుని వ్యక్తులు చనిపోయిన ఘటనలు అనేకం. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు ఆ మాంజాను వాడకుండా నిషేధం విధించాయని, వీటి అమ్మకాలపై నిఘా పెట్టామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. కాగా.. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో పతంగులను వందలాది సంఖ్యలో ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

కరీమాబాద్: జిల్లా ప్రజలకు కలెక్టర్ డాక్టర్ బి.గోపి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతీ పండుగకు ఒక విశేషం ఉందని పేర్కొంటూ.. మూడు రోజులపాటు జరిగే వేడుకను అందరూ కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

నకిలీ ముఠా గుట్టు రట్టు
టీజీపను బలోపేతం చేయాలి
పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యం
ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు
-10లో

బీఆర్ఎస్ వీఆర్ఎస్‌కు సిద్ధంగా ఉండాలి

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

వర్ధన్నపేట: టీఆర్ఎస్, బీఆర్ఎస్ అంటూ ఎన్ని అవతారాలు ఎత్తినా ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, ఇక బీఆర్ఎస్ వీఆర్ఎస్‌కు సిద్ధంగా ఉండాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఐనవోలు దేవాలయం నుంచి భారీ వాహన ర్యాలీతో వర్ధన్నపేట పట్టణానికి చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం ఇల్లంద శివారు శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దమ్ముంటే తమిళనాడు, జార్ఖండ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మాదిరిగా బీసీ, ఎస్సీ, మైనార్టీల రిజర్వేషన్లు పెంచి ప్రస్తుత గ్రూప్-1, అన్ని ఉద్యోగాలకు ఆ రిజర్వేషన్లు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బీసీ భవనాలను హైదరాబాద్ నాలాలపై నిర్మిస్తూ.. ఆధిపత్య వర్గాల భవనాలను మాదాపూర్ వంటి విలువైన భూముల్లో నిర్మిస్తున్నారని ఆరోపించారు. పేదలకు న్యాయం జరగాలన్నా, భూములకు పట్టాలు రావాలన్నా, దొరల పాలన పోవాలన్నా బహుజన రాజ్యం రావాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సదానందం, పద్మ, పుష్పలత, సునీల్, కార్తీక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో బాలుడి మృతి


హిమాన్ష్ను (ఫైల్)

ములుగు రూరల్: పాము కాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన ములుగు మండలం మల్లంపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన నత్తి రాజు కుమారుడు హిమాన్ష్ను(2) గురువారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుని ఇంట్లోకి వెళ్తున్న క్రమంలో నాగపాము కాలుపై కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి హిమాన్ష్ను మృతి చెందాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సారంగపాణి తెలిపారు.

ప్రాణం తీసిన రైలు ప్రయాణం

● మెట్ల పైనుంచి జారిపడి యువకుడి మృతి

జనగామ: పండుగ వేళ రైలు ప్రయాణం ఓ యువకుడి ప్రాణాలు బలితీసుకుంది. జనగామలోని అంబేడ్కర్ నగర్ శివారులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వరంగల్ రంగశాయిపేటకు చెందిన రొయ్యల సాయిప్రసాద్(22) డ్యాన్స్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. డ్యాన్స్ ప్రోగ్రాం కోసం వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పిన సాయిప్రసాద్ కాజీపేట నుంచి రైలులో జనగామకు బయలుదేరాడు. జనగామకు మరో ఐదు నిమిషాల్లో రైలు చేరుకుంటుందనగా మెట్లపై కూర్చున్న సాయిప్రసాద్ ప్రమాదవశాత్తు కిందపడిపోయి మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఫోన్ ఆధారంగా రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాజీపేట రైల్వే ఎస్సై కె.అశోక్‌కుమార్ తెలిపారు.

అప్పు తీర్చాలని అడిగినందుకు..

● రాళ్ల దాడి.. వ్యక్తిపై కేసు

వరంగల్ రూరల్: అప్పు తీర్చమని అడిగినందుకు రాళ్లతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏనుమాముల ఎస్సై పోగుల శ్రీకాంత్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పైడిపల్లి తాళ్ల గూడెంకు చెందిన పసునూరి సుధీర్– కల్పన భార్యాభర్తలు. పసునూరి కల్పన అక్క కొడుకు, ఆటో డ్రైవర్ పైడిపల్లి తాళ్లగూడెంకే చెందిన పసుల భాస్కర్‌కు అవసరాల నిమిత్తం రూ.2లక్షలు చేబదులుగా ఇచ్చారు. తాము ఇచ్చిన డబ్బు తిరిగి అడిగినందుకు పసుల భాస్కర్ గురువారం రాత్రి కల్పన, భాస్కర్‌ను దుర్భాషలాడుతూ రాళ్లతో దాడి చేశాడు. దీంతో కల్పన శుక్రవారం ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పసుల భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



జాతరకు వస్తున్న భక్తులు



బోనం సిద్ధం చేస్తున్న భక్తురాలు



పట్నం వేస్తున్న ఒగ్గు కళాకారులు



ఐలోని జాతర షురూ..

● ధ్వజారోహణంతో దేవుళ్లకు ఆవాహన
● తరలివస్తున్న భక్తులు



ఐనవోలు: ఐనవోలు మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రాతఃకాలంలో ఒగ్గు పూజారులు స్వామివారికి మేలుకొలుపు పలికారు. విఘ్నేశ్వర పూజ అనంతరం ఉదయం పూజారులు మహాన్యాస రుద్రాభిషేకం జరిపించి స్వామివారికి, అమ్మవార్లకు నూతన వస్త్రాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు, ఈఓ ధ్వజానికి కాషాయ పతాకాన్ని ఏర్పాటు చేసి ఆ పతాకాన్ని చేతబూని వేదమంత్రాలతో ఆలయం చుట్టూ మంగళవాయిద్యాలతో మూడు ప్రదక్షిణలు చేశారు. ఆ తర్వాత ఎలాంటి ఆటంకాలు కలుగకుండా జాతర సజావుగా జరగాలని మల్లన్న పరివార దేవుళ్లను ఆవాహన జరిపి కాషాయ పతాకాన్ని ఆలయ క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామి ఆలయంపైన, ప్రధాన ఆలయంపైన ప్రతిష్ఠించి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. అనంతరం మహాన్యాస రుద్రాభిషేకం చేసి నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్లో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, శ్రీనివాస్, మధుకర్‌శర్మ, మధుశర్మ, భీమన్న, పాతర్లపాటి నరేష్‌శర్మ, అధికారి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాలు, పట్నాలతో భక్తుల మొక్కులు

భక్తులు ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బోనం నెత్తిన పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఎల్లమ్మకు సమర్పించుకున్నారు. కొందరు భక్తులు వరం పట్టగా, మరికొందరు టెంకాయ బంధనం, ముడుపులు కట్టారు. శివసత్తుల పూనకాలు, నృత్యాలు అలరించాయి.

చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా వీరస్వామి

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం రద్దయిన నేపథ్యంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఎం.వీరస్వామిని నియమిస్తూ ఆర్‌జేసీ రామకృష్ణ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 17 వరకు వీరస్వామి ఆలయంలో విధులు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.


విద్యుత్ కాంతుల్లో ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయం

నేడు భోగి..

శనివారం భోగి పండుగను పురస్కరించుకుని ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మంత్రపుష్పం, దర్శనాలు ఉంటాయి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు.


స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు


ఆలయ ఆవరణలో సేదదీరుతున్న భక్తులు

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 9505514424

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభతో దేశంలో ప్రకంపనలు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: ఖమ్మంలో ఈ నెల 18న నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ సభ దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఖమ్మంలో నిర్వహించే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు జన సమీకరణపై శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని వెలికట్ట శివారు గార్డెన్‌లో తొర్రూరు, పెద్దవంగర మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరితో కలిసి రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు ప్రసంగించారు. టీఆర్‌ఎస్ స్థాపించినపుడు కరీంనగర్ సభ చరిత్రలో ఎలా నిలిచిపోయిందో అదే విధంగా ఖమ్మంలో జరిగే సభ అలానే ఉంటుందన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశ ప్రజలందరికీ అందించేందుకు కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్తున్నారన్నారు. మానుకోట సభలో సీఎం.. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు నిధుల ప్రకటన ఈ ప్రాంతంపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశమంతా అవసరమని, దానికి కేసీఆర్ నడుం కట్టారన్నారు. గుజరాత్ మోడల్‌ను చూపి మోదీ ప్రధాని అయ్యారని, ప్రస్తుతం ఆ మోడల్ దేశానికి నిరుపయోగమన్నారు. కార్యక్రమంలో లింగాల గణపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, తొర్రూరు, పెద్దవంగర బీఆర్‌ఎస్ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, ఈదురు ఐలయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో మంత్రి 'గంగుల' తండ్రి అస్థికల నిమజ్జనం


తండ్రి అస్థికలకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి

కాళేశ్వరం: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య ఇటీవల కన్నుమూసిన విషయం తెలిసిందే. శుక్రవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరిలో మల్లయ్య అస్థికలకు మంత్రి.. తన సోదరులతో కలిసి శ్రాద్ధకర్మ పూజలు నిర్వహించారు. అనంతరం త్రివేణి సంగమం వద్ద నిమజ్జనం చేశారు. అంతకు ముందు మంత్రి గంగులను భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట తహసీల్దార్ శంకర్, సివిల్‌సప్లయీస్ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు స్థల పరిశీలన


కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేస్తున్న ఈఓ రాజేంద్రం, అధికారులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మల గద్దె ప్రాంగణంలో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు దేవాదాయశాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం సాంకేతిక నిపుణులతో కలిసి కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు కోసం స్థల పరిశీలించారు. ఫిబ్రవరి 1 నుంచి 4 తేదీ వరకు జరిగే మేడారం మినీ జాతరలో ప్రయోగాత్మకంగా కన్వేయర్ బెల్ట్ పనితీరును పరిశీలించనున్నారు. కాగా, జాతరలో గద్దెల వద్ద భక్తులు సమర్పించిన బంగారం(బెల్లం) పేరుకుపోతుంది. భక్తుల రద్దీ ఉన్న సమయంలో బంగారం ప్రసాదంగా అందించడం అధికారులకు సాధ్యం కావడంలేదు. అయితే ఈసారి క్యూలైన్లలో వచ్చే భక్తులు అమ్మవార్లకు సమర్పించే బంగారాన్ని కన్వేయర్ బెల్ట్ వద్ద చేరవేస్తే అది నేరుగా అధికారులు నిర్ణయించిన ప్రదేశానికి చేరనుంది. దీంతో అమ్మవార్ల గద్దెల వద్ద భక్తులు ప్రశాంతంగా మొక్కులు చెల్లించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి జరిగే మినీ జాతరలో ఈ కన్వేయర్ బెల్ట్ విధానం ఏర్పాటు చేయడం ద్వారా సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలించనున్నారని ఈఓ రాజేంద్రం తెలిపారు.

18న పారిశుద్ధ్య సామగ్రి పంపిణీకి వేలం

మినీ మేడారం జాతరలో పారిశుద్ధ్య పనులకు బ్లీచింగ్ పౌడర్, సున్నం, తట్టలు, పారలు, ఫినాయిల్, తదితర సామగ్రి సరఫరా కోసం ఈనెల 18న ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డీపీఓ వెంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94410 01504 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

21న ఐటీడీఏ జాబ్‌మేళా

● 1,100 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ఏటూరునాగారం: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన యువతీయువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 21న ములుగు జిల్లా జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 1,100 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, డీఫార్మసీ, ఎంబీఏ, బీటెక్ చదివిన వారు విద్యార్హతల పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

వరంగల్ మీదుగా రేపు వందేభారత్ రైలు

● సికింద్రాబాద్– వైజాగ్ మధ్య ప్రయాణం
● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కాశిబుగ్గ/కాజీపేట రూరల్: వరంగల్ ప్రాంత ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 15న సంక్రాంతి కానుకగా వరంగల్ మీదుగా పరుగులు తీయనుంది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య నడిచే ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే సమయంలో సికింద్రాబాద్‌లో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ జెండా ఊపుతారు. వారంలో ఆదివారం మినహా మిగతా ఆరు రోజులు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పరుగులు పెట్టనుంది. విశాఖపట్నంలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మధ్యలో రాజమండ్రి, విజయవాడ, ఖమ్మంలో ఆగుతూ మధ్యాహ్నం 12.05 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై వరంగల్‌కు సాయంత్రం 4.35 గంటలకు చేరుకుంటుంది. ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి మీదుగా రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుటుంది. రైలు మొత్తం ఏసీతో కూడిన 18 బోగీలు ఉంటాయి. లోకో పైలెట్ క్యాబిన్‌కు అనుసంధానంగా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది. ప్రయాణికులకు అవసరమైన అన్ని అత్యాధునిక సదుపాయాలు ఈ రైలులో ఉన్నాయి. వరంగల్‌లో ఒక నిమిషం హాల్ట్ మాత్రమే ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వర్చువల్‌గా ప్రారంభం..

ప్రధాని మోదీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభిస్తున్నారు. 02844 నంబర్‌తో సికింద్రాబాద్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు బయలుదేరుతుంది. ప్రారంభించిన రోజు మాత్రం చర్లపల్లి, భువనగిరి, జనగామ, కాజీపేట జంక్షన్, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడుదవోలు, రాజమండ్రి, ద్వారపుడి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడస్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు. రాత్రి 7గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుంది. ప్రయోగాత్మకంగా నడిపిస్తున్నందున ప్రయాణికులకు అనుమతి లేదు. 16వ తేదీ నుంచి 20833/20834 నంబర్లతో ఈ రైలు విశాఖపట్టణం–సికింద్రాబాద్‌ల మధ్య నడుస్తుంది. ఈ రైలులో ప్రయాణించాలంటే రిజర్వేషన్ చేసుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు. కానీ టికెట్ ధరలు మాత్రం ప్రకటించలేదు. దేశంలోని వందే భారత్ రైళ్లకు వర్తించిన విధంగానే టికెట్ ధరలు ఉంటాయని అధికారులు తెలిపారు. కాగా, కాజీపేట జంక్షన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం పలికి ఇక్కడి నుండి ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులతో ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్యాసింజర్ రైలు రద్దు

డోర్నకల్: విజయవాడ – కొత్తగూడెం మధ్య నడిచే ప్యాసింజర్ రైలును శనివారం నుంచి నాలుగు రోజుల పాటు రద్దు చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు నడుస్తుండడంతో ఈ నెల 16వ తేదీ వరకు విజయవాడ – కొత్తగూడెం ప్యాసింజర్ రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటించారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని..

● పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గీసుకొండ: మద్యానికి డబ్బు ఇవ్వలేదని పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రేటర్ వరంగల్ ఆదర్శ నగర్‌కు చెందిన తేజావత్ పంతులు(50) తాగుడుకు బానిసయ్యాడు. శుక్రవారం మద్యం తాగి ఇంటికి వచ్చి ఇంకా డబ్బు కావాలని తన భార్య సాలమ్మను అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. విషయాన్ని భార్యతో పాటు బంధువులకు చెప్పడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పంతులు మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

వేధింపులతో ఒకరు..


పాపయ్య (ఫైల్)

సంగెం: వీఆర్ఏ వాటా కోసం దాయాదులు వేధించడంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం నార్లవాయిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తాడెం పాపయ్యకు ఇద్దరు కుమారులు పెద్ద సాయిలు, చిన్న సాయిలు, కూతురు గుంటక లక్ష్మి ఉన్నారు. పాపయ్య అనంతరం పెద్ద కుమారుడు పెద్ద సాయిలు పేరున వీఆర్ఏ పట్టా ఉంది. ఒప్పందం ప్రకారం ఏడాదికి ఒకరు చొప్పున పెద్ద సాయిలు, చిన్న సాయిలు, గుంటుక సదానందం వీఆర్ఏ వాటాదారులుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం వాటాదారు వ్యవస్థను తీసిసి పట్టాదారు పేరునే పర్మనెంట్(పే స్కేల్) చేస్తామని ఉత్తర్వులు ఇవ్వడంతో గొడవ మొదలైంది. దీంతో ఉద్యోగ విషయమై వాటా పరిహారం కోసం మాట్లాడుకుందామని మిగిలిన ఇద్దరు పట్టుబట్టడంతో వీఆర్ఏ యూనియన్, పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుందామని పెద్ద సాయిలు చెప్పాడు. వారు దానికి ఒప్పుకోలేదు. ఈ క్రమంలో పెద్ద సాయిలు కుమారుడు తాడెం పాపయ్య వారం రోజుల క్రితం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌ను పిలవగా చిన్న సాయిలు, చిన్న పాపయ్య, గుంటుక సదానందం, శ్రీకాంత్ అడ్డుకున్నారు. వాటా విషయం తేలిన తర్వాతే దున్నుకోవాలని వేధింపులకు గురిచేశారు. శుక్రవారం సైతం అడుకుని ఉద్యోగ విషయం పరిష్కారమైన తర్వాతే భూమి దున్నుకోవాలని చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన తాడెం పాపయ్య(51) పొలం వద్ద పురుగుల మందు తాగాడు. ఇంటికి రాకపోవడంతో అతడి కుమారుడు చరణ్ పొలం వద్దకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. దీంతో ఎంజీఎంకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పాపయ్య మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సంగెం పోలీసులు తెలిపారు.